క్లుప్తంగా

పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయండి

మున్సిపల్‌ కమిషనర్‌ శేషన్న



తెనాలిఅర్బన్‌: పట్టణంలో జరుగుతున్న పంట, మురుగు కాల్వల పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్‌ కమిషనర్‌ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న తూర్పు కాల్వ, జంపని కాల్వ పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. కాల్వ పూడికతీతకు సంబంధించిన రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాల్వల పూడికతీత పనుల్లో జాప్యం జరిగితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. మురుగు కాల్వల్లో ఉన్న వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని సూచించారు. మురుగు పారుదల సక్రమంగా జరగకపోతే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, డీఈ సుబ్బారావు, పలువురు ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కొమ్మూరు చెరువులోకి దూసుకువెళ్లిన లారీ

కొమ్మూరు(కాకుమాను): అనుభవం లేని క్లీనర్‌ లారీ నడపడంతో మండలంలోని కొమ్మూరులో లారీ బీభత్సం సృష్టించింది. ఎస్‌ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు.. మార్టూరుకు చెందిన లారీ ఏపీ 27 టీజడ్‌ 3929 నెంబరుతో అన్‌లోడ్‌ నిమిత్తం కార్లపాలెం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో సంఘటన చోటు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. తిరుగు ప్రయాణంలో లారీ క్లీనర్‌ డ్రైవింగ్‌ చేయడం, అతనికి ఫిట్స్‌ కూడా ఉన్నాయి. మండలంలోని కొమ్మూరు గ్రామానికి వచ్చే సమయానికి క్లీనర్‌కు ఫిట్స్‌ రావడంతో మూడు ద్విచక్ర వాహనాలు, మూడు విద్యుత్‌ స్తంభాలను ఢీ కొట్టి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న చెరువులోకి లారీ దూసుకుపోయినట్లు ఆయన తెలిపారు. ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకులకు స్వల్ప గాయాలు అయ్యాయి. మూడు విద్యుత్‌ స్తంభాలు ధ్వంసం అయినట్లు ఆయన తెలిపారు లారీ డ్రైవర్‌కు, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విద్యుత్‌ శాఖ అధికారులు, క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

భక్తి ప్రపత్తులతో చండీహోమం



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని శీతలయంత్రం వద్ద గురువారం చండీహోమం నిర్వహించారు. ఇక్కడి రావి చెట్టు పెద్దదిగా ఉండటంతో దానిని తొలగించేందుకుగాను, గ్రామం సుభిక్షంగా ఉండేందుకు చండీహోమం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమాలను వేదపండితుడు సుబ్రహ్మణ్యశాస్త్రి పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నెక్కల్లు సహకార సంఘం పదవికి కోటిరెడ్డి రాజీనామా



పెదపరిమి (తాడికొండ): నెక్కల్లు కో ఆపరేటివ్‌ సొసైటీ చైర్మన్‌ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చైర్మన్‌ మున్నంగి కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులలో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యతగా రాజీనామాను డివిజనల్‌ కో ఆపరేటివ్‌ సొసైటీ అధికారికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

30న ఎంసెట్‌, అడ్వాన్స్‌డ్‌, నీట్‌ ర్యాంకర్లకు సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్‌: హైదరాబాద్‌ కేంద్రంగా ఉన్న అవోపా బ్యాంకు మెన్‌ చాప్టర్‌ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ నుంచి ఎంసెట్‌, నీట్‌, జేఈఈ అడ్వాన్స్డ్‌–2024 ప్రవేశ పరీక్షల్లో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన వారిలో వంద మంది ఆర్యవైశ్య విద్యార్థులను స్వర్ణ పతకాలతో సత్కరించనున్నట్లు ఏరియా కో–ఆర్డినేటర్లు చెలికాని సీతారామయ్య, కొత్త రామానందం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉదయం 9.00 గంటలకు హైదరాబాద్‌ లక్డీకాపూల్‌లోని వాసవీ కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98852 29289, 92905 29133 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మోగిన బడి గంట..!

- పాఠశాలలకు ఉత్సాహంగా పరుగులు తీసిన విద్యార్థులు
- తొలి రోజునే పాఠ్యపుస్తకాల పంపిణీ
- గత ప్రభుత్వ హయాంలో ముందస్తుగా సిద్ధం చేసిన పుస్తకాలు
- ఏఐ టెక్నాలజీతో ఆకర్షణీయంగా పుస్తకాల రూప కల్పన
- జాతీయ విద్యా ప్రణాళికకు అనుగుణంగా పొందు పరిచిన పాఠ్యాంశాలు

ఉత్సాహంగా బడుల వైపు బుడిబుడి అడుగులు వేస్తున్న చిన్నారులు..తన సహచర విద్యార్థి కనిపించగానే మెరిసే కళ్లతో పలకరింపులు...బడి మాటెత్తితే బెంగపడే పిల్లల మారాంలు, బుజ్జగింపుతో తరగతిలోకి పంపుతున్న తల్లులు...సుదీర్ఘ సెలవుల తర్వాత హడావిడిగా స్కూళ్లకు వస్తున్న టీచర్లు...వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభం రోజైన గురువారం వివిధ పాఠశాలల్లో కనిపించిన దృశ్యాలివి.

తెనాలి: యాభై రోజుల సెలవు దినాల అనంతరం బడిగంట మోగటంతో అన్ని పాఠశాలలు కళకళలాడాయి. ఉన్నంతలో మంచి దుస్తులు ధరించి, పుస్తకాల బ్యాగులతో వచ్చిన పిల్లల ఆనందం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులు, నేస్తాలతో గడిపిన సెలవుల సరదాలు, విహార యాత్రల్లో మధురానుభూతులు, బంధుమిత్రుల ఊళ్లకు చేసిన ప్రయాణాలు, చూసిన సినిమాలు, కొన్న ఆట వస్తువులు వంటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఉల్లాసంగా గడిపారు.

సిద్ధమైన పాఠ్యపుస్తకాలు..

పట్టణంలో ఆరు ఉన్నత పాఠశాలలు, 38 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. రూరల్‌ మండలంతో కలిపితే మొత్తం 98 పాఠశాలలు ఉండగా, వీటిలో లక్షమంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇవి కాకుండా ప్రైవేటు పాఠశాలలు, వాటి విద్యార్థులు అదనం. బడులు తెరిచిన రోజే పుస్తకాలు, విద్యాకానుక కిట్లు పంపిణీ చేసే నిమిత్తం గత ప్రభుత్వం పుస్తకాలను సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఎక్కడికక్కడ స్టాక్‌ పాయింట్లకు వీటిని తరలించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారినప్పటికీ ఇప్పటికే సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు, వర్క్‌ పుస్తకాలతో పాటు బూట్లు, సాక్స్‌, టైలు వంటి వాటిని స్టూడెంట్‌ కిట్లుగా పేర్కొంటూ పంపిణీకి ఆదేశాలను ఇచ్చింది.



స్టాక్‌ పాయింట్‌లో పుస్తకాల పంపిణీ

తొలిరోజే పంపిణీ..


బడి తెరిచిన రోజే విద్యార్థులకు పుస్తకాలు, స్టూడెంట్‌ కిట్ల పంపిణీని విద్యాశాఖ అధికారులు చేపట్టారు. తెనాలి పట్టణం, రూరల్‌ మండలాలలకు కలిపి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్‌ ఉన్నత పాఠశాల స్టాక్‌ పాయింట్‌గా ఉంది. గురువారం ఆ స్టాక్‌ పాయింట్‌ నుంచి అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, వర్క్‌ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. అ వెంటనే వాటిని పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తున్నారు. తెనాలి డివిజన్‌ విద్యాధికారి శాంతికుమారి, మండల విద్యాధికరి డాక్టర్‌ మేకల లక్ష్మీనారాయణ కొత్తపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు.

ఏఐ టెక్నాలజీతో ఆకర్షణీయంగా పుస్తకాలు

ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌తో పాఠ్య పుస్తకాల కవర్‌ పేజీలను తీర్చిదిద్దటం ఈసారి ప్రత్యేకత. ఈ కారణంగా పాఠ్యపుస్తకాలు ముచ్చట గొలుపుతున్నాయి. కవర్‌ పేజీని చూడగానే నిజమైన బొమ్మల్లాగ అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. పుస్తకంపై క్యూ ఆర్‌ కోడ్‌ మరొక అంశం. దీనిని స్కాన్‌ చేసుకుని పాఠ్య పుస్తకాన్ని డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. ప్రింట్‌ కూడా తీయించుకోవచ్చు.

జాతీయ విద్యా ప్రణాళికను అనుసరించి

ఇన్ని ప్రత్యేకతలున్న పుస్తకాలను జాతీయ విద్యా ప్రణాళిక–2020కు అనుగుణంగా తీర్చిదిద్దటం మరో విశేషం. జాతి చారిత్రక, కళాత్మక వారసత్వాన్ని తర్వాతి తరాలకు అందించే విలువైన సాధనంగా భాషను జాతీయ విద్యా ప్రణాళిక పేర్కొనటమే కాదు.. భాషాధ్యయనం ద్వారా నైతిక వికాసం, శీల నిర్మాణం జరగాలనీ సూచించింది. ఈ లక్ష్య సాధనకు అనుగుణంగా దేశభక్తి, తల్లిదండ్రుల సేవ, కుటుంబ విలువలు, ప్రకృతి–పర్యావరణ స్పృహ, ఆధునిక విద్య–ఆవశ్యతక, స్త్రీ ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల వంటి ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు.



ఏఐ టెక్నాలజీతో తీర్చిదిద్దిన పాఠ్యపుస్తకాల కవర్‌ పేజీలు



పాఠశాలకు వెళుతున్న చిన్నారులు



పాఠ్యపుస్తకాలతో విద్యార్థినులు

లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు

తెనాలిరూరల్‌: జాతీయ లోక్‌ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 29న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న జాతీయ లోక్‌ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని అన్నారు. కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్‌ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్‌ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్‌ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాజీ కాదగిన సివిల్‌, క్రిమినల్‌, ప్రిలిటిగేషన్‌, వాహనాలు, బ్యాంకులు, బీఎస్‌ఎన్‌ఎల్‌, భరణాల కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ప్రజలంతా న్యాయశాఖ కల్పించిన లోక్‌ అదాలత్‌లను వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామ సేవకు ఎంపికైన సందర్భంగా 60 మంది విద్యార్థులకు గురువారం సత్యసాయి సేవా సమితి సభ్యులు నోట్‌ పుస్తకాలు, స్టేషనరీ, బాబావారి ప్రసాదం అందజేశారు. స్థానిక రుక్మాభాయి సహిత పాండురంగ స్వామి దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా గ్రామ సేవా సమన్వయకర్త టి.శ్రీనివాసరావు, బాలవికాస్‌ కో ఆర్డినేటర్‌ వి.వెంకటేశ్వరరావు, సేవా సమన్వయకర్త ఎం.గోవర్ధనరావు, సీవోడీ అన్నే రవికుమార్‌, ఆధ్యాత్మిక సమన్వయకర్త ధారా నారాయణమూర్తి, సమితి కన్వీనర్స్‌ వి.బసవపున్నయ్య, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను దాతలు ప్రోత్సాహించడం అభినందనీయమని ఎస్‌సీఆర్‌, ఎస్‌ఎంహెచ్‌ స్కూల్‌ ప్రధానోపాధ్యాయులు బషీర్‌ అహ్మద్‌ పేర్కొన్నారు. యండ్రుపాటి రాధాకుమారి జ్ఞాపకార్థం ఆమె తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు యండ్రుపాటి చింపయ్య ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1,116లు చొప్పున ఎస్‌సీఆర్‌ స్కూల్‌లో గురువారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో చింపయ్య ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్‌.వెంకట కృష్ణారావు, బి.సుబ్బారావు, వై.శాంతి సుధ తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాత చింపయ్య

అద్వితీయమైనది మయ సభ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌ గార్డెన్స్‌ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్‌ ఆధ్వర్యంలో గురువారం మహా భారతంలోని సభా పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అవతార సమాహారం మహాభారతం అని పేర్కొన్నారు. మహాభారతంలోని సభా పర్వంలో మయ సభ అద్వితీయమన్నారు. జూదం అనేది పురాణంలో ఉందన్నారు. స్నేహంతో ఆడుకునే జూదం హాని కాదని, కావున శకునితో జూదం ఆడటానికి అనుమతివ్వాలని దుర్యోధనుడు అన్నాడని తెలిపారు. ధర్మరాజు సుయోధనుడితో ధనాన్ని సత్కారాలకు వినియోగించాలని, జూదానికి వినియోగించడం మంచిది కాదని చెప్పినట్లు వివరించారు. సభలో జరిగిన జూదం విశేషాలను భక్తులకు వివరించారు.

హార్టికల్చర్‌ ప్లాంటేషన్‌పై దృష్టి పెట్టండి

వేమూరు: రైతులంతా హార్టికల్చర్‌ ప్లాంటేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో శేషగిరి రావు అన్నారు. వేమూరు మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు మొక్కల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సోమవారం నుంచి ప్రతి గ్రామంలో సోషల్‌ ఆడిట్‌ జరుగుతుందన్నారు. అంతా కలిసి పారదర్శకంగా సోషల్‌ ఆడిట్‌ పూర్తి చేయాలని సూచించారు.

ఆరోగ్య అవగాహనకు ‘జీవ’ పుస్తకావిష్కరణ

డీ3శారద సర్వీస్‌ సొసైటీ ఆధ్వర్యంలో నేడు ఆవిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్‌ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన ‘జీవ’ పుస్తకావిష్కరణ శుక్రవారం జరగనుంది. అత్యవసర పరిస్థితుల్లో రక్తదాతలను ఆధునిక టెక్నాలజీ సాయంతో అందించటమే కాకుండా స్త్రీలలో జరిగే కొన్ని అబార్షన్స్‌, రక్తానికి గల సంబంధం, పుట్టుకతో సంక్రమించే వ్యాధులను నివారించే విధానాలతో ‘జీవ’ పుస్తకాన్ని రూపొందించినట్టు సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్‌ శారద వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ప్రస్తుతం దేశంలో ఏటా 15 మిలియన్ల రక్త యూనిట్లు అవసరం కాగా, 10 మిలియన్‌ యూనిట్లు మాత్రమే లభ్యమవుతోందని చెప్పారు. రక్త దాతలతో కూడిన వెబ్‌సైట్‌ ఉన్నప్పటికీ దాతలు, అవసరమైన వారికి సమయం మ్యాచ్‌ కాకపోవటం, దూర ప్రాంతంలో ఉండటం జరుగుతోందని తెలిపారు. అవసరమైన రక్తదాతల రిజిస్ట్రీతో పాటు పుట్టుకతో సంక్రమించే వ్యాధులు గల పసిపిల్లలకు రక్తదాతల అవగాహన రాహిత్యంతో కొన్ని ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. పుట్టుకతో వచ్చే పసికర్లు, స్త్రీలలో జరిగే అబార్షన్లకు రక్తం గ్రూపులకు గల సంబంధంపైనా ప్రజలకు అవగాహన లేదన్నారు. ఈ అంశాలపై ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా పని చేస్తూనే ప్రత్యేకంగా ‘జీవ’ అనే పుస్తకాన్ని విడుదల చేస్తున్నామని డాక్టర్‌ శారద తెలియజేశారు. దీని ద్వారా వైద్యానికి కావాల్సిన సమాచారం, ప్రభుత్వ పరంగా ఉన్న వనరులు అందుబాటులో ఉంటుందని ఇదంతా ఉచితమేనని వివరించారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశంలో ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో ప్రతినిధులు లక్ష్మి, రేఖ, చైతన్య, దీప్తి, రూప, సువర్చల, రాజు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన డాక్టర్‌ శారద

ప్రభుత్వ భవనాలపై పార్టీల జెండాలు

- తొలగించేందుకు భయభ్రాంతులకు గురవుతున్న అధికారులు
- రాబోయే కాలంలో మిగిలిన కార్యాలయాలకు కూడా ఇదే పరిస్థితా?
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్‌ చేస్తున్న ప్రజలు

తాడేపల్లిరూరల్‌ : టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా జనసేన, టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి ప్రభుత్వ భవనాలపై దాడులు, ఆస్తులను ధ్వంసం చేశారు. ఎంటీఎంసీ పరిధిలో జనసేన, టీడీపీ కార్యకర్తలు ఒక అడుగు ముందుకు వేసి ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ స్థలంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్‌పై ఆయా పార్టీల జెండాలు ఏర్పాటు చేశారు. ఎనిమిది రోజుల క్రితం కార్పొరేషన్‌ పరిధిలోని ఇప్పటంలో డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా, చాకలి ఐలమ్మ, గౌతు లచ్చన్న పేర్లతో కమ్యూనిటీ హాల్‌ నిర్మించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీపై అక్కసుతో ఆ భవానికి ఉన్న వైఎస్సార్‌ పేరును తొలగించారు. అంతటితో ఆగకుండా కమ్యూనిటీ హాల్‌ బయట ఉన్న వైఎస్సార్‌ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. కమ్యూనిటీ హాల్‌పై టీడీపీ, జనసేన జెండాలను ఏర్పాటు చేశారు. ఇది జరిగి ఎనిమిది రోజులు గడుస్తున్నా కార్పొరేషన్‌ అధికారులు ఆ జెండాలను తొలగించేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు. అధికారులు జెండాలు తొలగిస్తే చేతులు తీసేస్తామంటూ ఫోన్లల్లో కొందరు బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో అధికారులు ఆ జెండాలను తీసేందుకు వెనకాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని ఇటువంటి చర్యలను ఖండించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కేసులు పెట్టాలి. భవిష్యత్తులో పార్టీ జెండాలను ప్రభుత్వ కార్యాలయాలపై ఏర్పాటు చేస్తారని, పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదల పవన్‌కళ్యాణ్‌ ఇప్పటంలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని 2022 మార్చి 14వ తేదీన ఏర్పాటు చేశారు. ఇప్పటం రైతులు సహకరించినందుకు ఇప్పటం గ్రామానికి 50 లక్షల నగదును ప్రకటించారు. ఆ నగదుతో ఇప్పటాన్ని అభివృద్ధి చేయకుండా, అభివృద్ధి చేసిన ఇప్పటాన్ని ధ్వంసం చేయడం చాలా బాధాకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేశారు కాబట్టి అది ప్రభుత్వ ఆస్తి అని కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా టీడీపీ, జనసేన కార్యకర్తలు ఆ విషయాలను పట్టించుకోకుండా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ పార్టీ జెండాలను ఏర్పాటు చేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే పార్టీ జెండాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



కమ్యూనిటీ హాల్‌పై పేరు తొలగించి ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన పార్టీల జెండాలు (ఫైల్‌)

వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకూడదు

నగర కమిషనర్‌ కీర్తి చేకూరి ఆదేశాలు

నెహ్రూనగర్‌: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకు డివిజన్ల వారీగా ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్‌ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మెడికల్‌ క్లబ్‌, నల్ల చెరువు, బుడంపాడు బైపాస్‌, కాకాని రోడ్‌ రిలయన్స్‌ పెట్రోల్‌ బంక్‌ తదితర ప్రాంతాల్లో అవుట్‌ ఫాల్‌ డ్రెయిన్‌లలో జరుగుతున్న పూడికతీత పనులను ఇంజినీరింగ్‌, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వర్షపు నీరు నిలిచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీరు నిలిస్తే ఆయా అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నగర పరిధిలోని ప్రధాన అవుట్‌ ఫాల్‌ డ్రెయిన్‌లలో ఇప్పటికే పూడిక తీత పనులు జరుగుతున్నాయని, మిగిలిన ప్రాంతాల్లో కూడా పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పూడిక తీసే ప్రాంతాల్లో ఆక్రమణలు ఉంటే వెంటనే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించాలన్నారు. పనులను ఎమినిటి కార్యదర్శులు దగ్గరుండి పర్యవేక్షించాలని, పూడిక తీతకు ముందు, తర్వాత ఫోటోలు తీయాలన్నారు.

నేటి నుంచి జగన్నాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

లాలాపేట, కొత్తపేటలో మూడు మఠాలు ఏర్పాటు

నగరంపాలెం: గుంటూరు కొత్త పేటలోని (పశువుల ఆసుపత్రి ఎదురు) శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు వేడుకలు జరగనున్నాయి. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. గుంటూరు నగర, శివార్లతోపాటు జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. దేవస్థానాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలకరించారు.

స్వామి వార్ల క్షేత్ర చరిత్ర..

క్రీ.శ 1717లో ఉత్తరాదిన నివసించే భక్తులు శ్రీ అయోధ్య జగన్నాథదాసు బావాజీ, శ్రీ అయోధ్య శ్యామల దాసుబావాజీ, శ్రీ అయోధ్య భగవాన్‌ దాసు బావాజీ దక్షిణానికి వలస వచ్చారు. ఈ క్రమంలో మూడు మఠాలను నెలకొల్పారు. అందులో గుంటూరు లాలాపేటలో శ్రీ పద్మావతి ఆండాళ్‌ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి, కొత్తపేట (పశువుల ఆసుపత్రి ఎదురు)లోని మఠంలో శ్రీ జగన్నాథ స్వామి, కొత్తపేట గుంట గ్రౌండ్‌ ఎదురు మఠంలో ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించారు. ఈ మఠాలకు వచ్చే భక్తులకు భోజన, మౌలిక వసతులు కల్పించారు. ఈ క్రమంలో 1795లో వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఈ మఠాలను సందర్శించి, 300 ఎకరాల భూమి రాసిచ్చారు. అప్పట్నుంచి ఇప్పటి వరకు ప్రతి నిత్యం ధూప దీప నైవేద్యాలు జరుగుతున్నాయి. కాలక్రమేణా 1965–66లో దేవదాయ, ధర్మదాయ శాఖ లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్‌ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, 1974–75లో కొత్తపేట శ్రీజగన్నాథ స్వామి దేవస్థానం, శ్రీఆంజనేయస్వామి దేవస్థానాన్ని స్వాధీనం చేసుకుంది. అనంతరం మూడు దేవాలయాలు ఒక గ్రూప్‌గా ఏర్పడగా, సహాయ కమిషనర్‌ (ఈవో) పర్యవేక్షిస్తున్నారు.



విద్యుత్‌ వెలుగుల్లో కొత్తపేటలోని శ్రీజగన్నాథ స్వామి దేవస్థానం

వయోజనులకు టీబీ టీకా

తాడేపల్లిరూరల్‌ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో వయోజనులకు టీబీ టీకా కార్యక్రమాన్ని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా టీబీ నివారణ కార్యక్రమ కో ఆర్డినేటర్‌ వి. రాజశేఖర్‌ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్షయవ్యాధి నివారణకు మందులు వాడిన వారు, వారి సహాయకులు కూడా ఈ వయోజన టీబీ టీకాను వేయించుకోవాలని సూచించారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్‌ ఆఫీసర్‌ సి. ఇందిర మాట్లాడుతూ షుగరు వ్యాధిగ్రస్తులు ఈ టీకాను తీసుకోవచ్చని చెప్పారు. పిల్లలు టీకాను తీసుకోరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో టీబీ రవికుమార్‌, ఆరోగ్య కార్యకర్త బుజ్జి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ...

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో షుగర్‌ వ్యాధిగ్రస్తులకు క్షయవ్యాధి సోకకుండా గురువారం ఆరోగ్యసిబ్బంది బీసీజీ టీకాలు వేసినట్లు నుదురుపాడు పీహెచ్‌సీ, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫరీనాబేగం, శ్వేతలు తెలిపారు. వారు మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్నవారు, షుగర్‌ వ్యాధి ఉన్నవారు, అంతకు ముందు క్షయవ్యాధి ఉన్నవారు, వారికి సమీపంలో ఉన్నవారు కూడా బీసీజీ టీకాను వేయించుకునేలా ఆరోగ్యసిబ్బంది అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇప్పటివరకు టీకా వేయడం ప్రారంభించి 5వ గురువారం కాగా, నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 1,02 మందికి టీకాలు వేశామన్నారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 1741 మందికి వేసినట్లు వారు చెప్పారు. ఆయా గ్రామాల్లో టీకాలు వేసే తీరుతెన్నులను సీహెచ్‌వోలు వెంకటలక్ష్మీ, వెంకటరమణ, హెచ్‌వీలు నూర్‌ ఖాజాబీ, అన్నమేరిలు పరిశీలించారన్నారు.



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సమన్వయకర్త వి. రాజశేఖర్‌

గ్రామాల్లో ఉద్రిక్తతల కట్టడికి సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు రాజ్యలక్ష్మి, సీఐ జయకుమార్‌

మేడికొండూరు : గ్రామాలలో ఉద్రిక్తతల కట్టడికి ప్రజలంతా సహకరించాలని మండల తహసీల్దారు రాజ్యలక్ష్మి, సీఐ దార్ల జయకుమార్‌ పేర్కొన్నారు. మండల పరిధిలోని జంగంగుట్ల గ్రామ ప్రజలతో వారు సమావేశమయ్యారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామంలో జరిగిన ఘర్షణ గురించి ఆరా తీశారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరు గ్రామాల నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.